నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 30 మార్చి 2024 | HYDERABAD

ఎన్నికల ప్రచారంలో భాగంగా మహావీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

సమర్థవంతంగా అన్నపూర్ణ నిర్వహణ

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లోని కొన్ని ప్రదేశాలల్లో ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా అన్నపూర్ణ కేంద్రాలు పని చేయడం లేదని, త్వరలోనే సాధ్యాసాధ్యాలను పరిశీలించి వినియోగంలోకి తీసుకువస్తామని జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అన్నపూర్ణకు తాళం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురించిన ప్రత్యేక కథనానికి అధికారులు స్పందించారు. మూసాపేట గూడ్స్ సమీపంలోకి అన్నపూర్ణ సెంటర్‌ను ట్రాఫిక్, రవాణా వాహనాల దృష్ట్యా గతేడాది ఏప్రిల్‌లో నిలిపివేశామని, తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేలా పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లో పనిచేయని అన్నపూర్ణ కేంద్రాలపై సాధ్యాసాధ్యాల పరిశీలన జరుగుతుందన్నారు. అన్నపూర్ణ సెంటర్లను సమర్థవంతంగా నిర్వహిస్తామని, ఇందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని స్పష్టం చేశారు.

ఏ ఒక్క హామీని అమలు చేయని కాంగ్రెస్

మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

మన్సూరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందని.. కానీ ఏ ఒక్క హామీని సరిగ్గా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విమర్శించారు. రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మహావీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కులో రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మార్నింగ్ వాక్ నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని.. రాబోయే రోజుల్లో తప్పకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు.

ఫైళ్లు కదలక.. అనుమతులు రాక..

తీవ్ర నిరాశలో నిర్మాణ రంగం

ఆర్థిక ఇబ్బందుల్లో బిల్డర్లు.. కార్మికులకు ఉపాధి కరువు

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వంలో బిల్డర్లకు కష్టాలు తప్పడం లేదు. నిర్మాణ రంగంలో అనుమతుల కోసం అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సి వస్తోంది. కోట్లాది రూపాయల పెట్టుబడులతో నిర్మాణాలు చేపట్టాలని చూస్తున్న వారికి అనుమతులు సకాలంలో రాక తీవ్ర నిరాశే ఎదురవుతున్నది. నిర్మాణ రంగంలో భవన నిర్మాణ అనుమతులు పారదర్శకంగా, సత్వరమే పొందేలా గత ప్రభుత్వం టీఎస్ బీ పాస్ పాలసీని తీసుకొచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే 21 రోజుల్లో భవన నిర్మాణానికి అనుమతి వచ్చినట్లుగానే భావించి నిర్మాణం చేపట్టేలా ఆ పాలసీని రూపొందించారు. అదేవిధంగా స్థల విస్తీర్ణాన్ని బట్టి అనుమతుల విషయంలో అధికారులు ఆన్‌లైన్‌లో సమర్పించిన పత్రాలను పరిశీలించి నిర్ణీత వ్యవధిలో అనుమతులివ్వాల్సి ఉన్నా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్లానింగ్ విభాగం అధికారులు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నా, తుది అనుమతులు ఇవ్వడంలో మాత్రం జాప్యం చేస్తున్నారు.

ఎదురు చూపులు తప్పడం లేదు..

భవన నిర్మాణాలతో పాటు లేఅవుట్ల అనుమతులు సింహ భాగం జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోనే ఉంటాయి. వీటి పరిధిలోనే ప్రతి నెల వందలాది దరఖాస్తులు వస్తుంటాయి. 4 నెలల కాలంలో 350కి పైగా దరఖాస్తులు వచ్చాయి. అనుమతులు వచ్చినవి సింగిల్ డిజిట్‌కే పరిమితం కాగా, మిగతా దరఖాస్తులన్నీ అనుమతులకు నోచుకోలేదు. ముఖ్యంగా భవన నిర్మాణాలు, లేఅవుట్ల నిర్మాణాల కోసం ఆన్‌లైన్‌లో టీఎస్‌బీపాస్, డీపీఎంఎస్‌ల ద్వారా వచ్చే దరఖాస్తులను ప్లానింగ్ అధికారులు పరిశీలన చేస్తున్నారు. కొందరు దరఖాస్తు దారులు ఫీజు చెల్లించినా.. ప్రోసిడింగ్స్ మాత్రం ఇవ్వడం లేదు. కొన్ని అర్జీలు ఇంకా పరిశీలనలో ఉన్నాయనే సమాధానం ఇస్తున్నారే తప్ప, అనుమతులు ఇవ్వడం లేదు.

టీఎస్ బీపాస్ పాలసీ ప్రకారం సత్వరమే రావాల్సిన అనుమతుల్లో నెలల తరబడి జాప్యం జరుగుతుండడంతో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టే బిల్డర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. చాలా ప్రాజెక్టుల్లో పనులు మొదలు పెట్టలేని పరిస్థితి క్షేత్రస్థాయిలో నెలకొన్నది. కార్మికులకు ఉపాధి కరువైంది.

ఇదిగో ఇచ్చేస్తున్నాం..

అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ప్లానింగ్ విభాగం అధికారుల చుట్టూ తిరుగుతుంటే ఇదిగో ఇచ్చేస్తున్నాం... అంటూ అధికారులు చెబుతున్నారే తప్ప అనుమతులు మాత్రం రావడం లేదు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో తీవ్ర జాప్యం నెలకొంది. అపసోపాల నడుమ టౌన్‌ప్లానింగ్ అధికారులు కమిషనర్‌కు ఫైళ్లను చేర్చుతున్నప్పటికీ సకాలంలో సంబంధిత దరఖాస్తులకు అనుమతులు పొందడం కష్ట సాధ్యంగా మారింది. కమిషనర్ పరిధిలో దాదాపు 25 దరఖాస్తులు నెలల పైబడి పరిశీలన పేరుతో పెండింగ్‌లో ఉన్నట్లు బిల్లర్లలో చర్చ జరుగుతున్నది.

శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, కాలే యాదయ్య, గాంధీ, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

కాంగ్రెస్‌కు ఓటేసినందుకు బాధపడుతున్నారు

కాంగ్రెస్ పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదు

చేవేళ్ల ఎంపీగా కాసానిని గెలిపించుకుందాం

పట్నం, రంజిత్‌రెడ్డిని మళ్లీ పార్టీలోకి రానివ్వం

ఆస్కార్ లెవల్‌లో నటించి.. వెన్నుపోటు

- 13న చేవేళ్ల బహిరంగ సభను సూపర్ హిట్ చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ప్రాణం ఉన్నంత వరకు కేసీఆర్ వెంటే : సబితా ఇంద్రారెడ్డి
- ప్రజా సేవ చేసే భాగ్యం కల్పించండి : కాసాని జ్ఞానేశ్వర్

రంగారెడ్డి, మార్చి 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదని..ప్రతి ఒక్కరూ ఆ పార్టీకి ఎందుకు..ఓటు వేశామా.. అని బాధపడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ' బీఆర్ఎస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎంపీగా అవకాశం ఇస్తే.. నిలబడతానని ముందుకొచ్చిన ధీరోదాత్తుడు కాసాని జ్ఞానేశ్వర్' అని కొనియాడారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. బీసీల కోసం జీవితాన్ని త్యాగం చేసి కష్టపడ్డ గొప్ప నాయకుడు కాసాని అని అన్నారు. కేకే, కడియం వంటి పెద్ద పెద్ద నేతలు పార్టీని వీడుతున్న తరుణంలో కష్టకాలంలో మనకోసం వచ్చిన కాసానిని కడుపులో పెట్టుకొని చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నిలబిడ్డది కేసీఆర్ అని భావించి.. కమిట్‌మెంట్‌తో ఓటు వేసి కాసానిని చేవెళ్ల ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 13న చేవెళ్ల బహిరంగ సభకు ప్రతి గులాబీ కార్యకర్త తరలివచ్చి సూపర్ హిట్ చేయాలన్నారు.

ప్రభుత్వాన్ని కూల్చేది నల్లగొండ, ఖమ్మం బాంబులే

రేవంత్ ప్రభుత్వం ఐదేండ్లు ఉండాలని కోరుకుంటున్నామని, కానీ..కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేది నల్లగొండ, ఖమ్మం బాంబులేనని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఇచ్చిన 30వేల ఉద్యోగాలను తన ఖాతాలో వేసుకున్న రేవంత్‌పై యువత కోపంగా ఉందన్నారు. ఇప్పటికే నాలుగు నెలలు గడిచిపోయాయని, వచ్చే ఎనిమిది నెలల్లో 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి ఎన్నికల నాటి హామీని రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మనిషో, బీజేపీ మనిషో అర్థం కావడం లేదని, అసెంబ్లీ ఎన్నికల తర్వాత రేవంత్ రెడ్డి బీజేపీకి బీటీమ్‌గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలు ప్రశ్నించకుండా వారి దృష్టిని మరలిచ్చేందుకే ఫోన్ ట్యాపింగ్, స్కాములు అంటూ యూట్యూబ్‌లలో అసత్య ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు పోయి ఆరు గారడీలు వచ్చాయని విమర్శించారు.

పంటలు ఎండిపోతున్నా.. పట్టించుకోవడం లేదు..

పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతులకు 2 లక్షల రుణమాఫీ చేయలేదని, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం, పెంచిన ఆసరా పింఛన్లను ఇవ్వడం లేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు, ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. కులం, మతం పేరుతో బీఆర్ఎస్ ఏనాడూ రాజకీయం చేయలేదన్నారు. 17 ఎంపీ సీట్లలో బీఆర్ఎస్ ఆరుగురు బీసీలకు టికెట్లను ఇచ్చిందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేశ్వర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి, యువ నేత కార్తిక్ రెడ్డి, నాయకులు అవినాశ్ రెడ్డి, పర్యాద కృష్ణా రెడ్డి, నాగేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టకాలంలో వెన్నుపోటు..

కష్టకాలంలో పట్నం మహేందర్ రెడ్డి, రంజిత్ రెడ్డి పార్టీకి వెన్నుపోటు పొడిచారని కేటీఆర్ విమర్శించారు. చేవెళ్ల, పరిగిల్లో నిర్వహించిన సమావేశాల్లో ఇద్దరు నేతలు పార్టీని వీడేది లేదని ఆస్కార్ లెవల్‌లో నటించారని, పదిహేను రోజుల తర్వాత ఇద్దరు నేతలు పత్తాలేకుండా పోయారన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చినప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారని ఆరోపించారు. జిల్లాకు సంబంధం లేని రంజిత్ రెడ్డికి ఎంపీగా అవకాశమిస్తే కేసీఆర్ మనిషిగా కార్యకర్తలు గెలిపించినప్పటికీ పార్టీని వీడి ద్రోహం చేశారన్నారు. 'పట్నం, రంజిత్ రెడ్డిలు కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా..బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే మళ్లీ..ఆ ఇద్దరినీ పార్టీలోకి రానిచ్చేది లేదు' అని స్పష్టం చేశారు. 2014లో స్వయంగా విశ్వేశ్వర్ రెడ్డి ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించి ఎంపీగా గెలిపించినప్పటికీ ఆయన 2018లో వేరే పార్టీలోకి జంప్ అయ్యారని విమర్శించారు. కేకే, కడియం వంటి పెద్ద పెద్ద నాయకులు కష్ట కాలంలో పార్టీని వదిలి వెళ్తున్నారని, అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందన్నారు.

అంబర్‌పేటలో నేడు కేటీఆర్ పర్యటన

గోల్నాక: అంబర్‌పేట డివిజన్‌లో నేడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ ఎన్నికల ప్రచారాన్ని శనివారం సాయంత్రం 5గంటలకు అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్ నుంచి ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమానికి కేటీఆర్ హాజరవుతున్నట్లు వెల్లడించారు.

కాంగ్రెస్ వచ్చాక.. కరెంటు లేదు

- సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే

కాంగ్రెస్ వచ్చాక కరెంటు లేదు. పంటలు ఎండిపోతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పండుగలు వస్తున్నాయంటే నెల రోజుల ముందే కేసీఆర్ మమ్మల్నందరినీ అప్రమత్తం చేసేవారు. కేసీఆర్ విలువ ఇప్పుడిప్పుడే ప్రజలకు తెలుస్తున్నది. 13న చేవెళ్లలో నిర్వహించే బహిరంగసభకు పెద్ద ఎత్తున జనం తరలిరావాలి. నాపై కూడా కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారు. ప్రాణం ఉన్నంత వరకు కేసీఆర్ వెంటే ఉంటా. బడుగు బలహీనవర్గాల గొంతు పార్లమెంటులో వినిపించాలంటే జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించుకుని కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం.

సైనికుల్లా పనిచేయాలి

- దయానంద్‌గుప్తా, ఎమ్మెల్సీ

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అందరం కలిసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం. ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి.

సేవ చేసే భాగ్యం కల్పించండి

- కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి

సబ్బండ వర్గాల కోసం దశాబ్దాలుగా సేవ చేస్తున్నా. నాకు టికెట్ ఖరారైనప్పటి నుంచి మద్దతుగా ఉపాధ్యాయుల నుంచి పెద్ద ఎత్తున ఫోన్లు వస్తున్నాయి. ఆశీర్వదించండి. సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నా.

వారికి ఓటమి తప్పదు

- గాంధీ, ఎమ్మెల్యే

బీఆర్ఎస్ నుంచి రెండు సార్లు అవకాశం పొందిన నేతలు.. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో వేరే పార్టీల నుంచి బరిలోకి దిగారు. వారికి ఓటమి తప్పదు. రెండు పర్యాయాలుగా చేవెళ్ల అడ్డా గులాబీదే.. ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా ఎగురుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నది.

నగరంలో హస్తం ఎదురీత!

- మహా నగర పరిధిలోని ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా బీఆర్ఎస్ జంపింగ్‌లే
- దానం అభ్యర్థిత్వంపై డైలమా
- చేవెళ్లలో కానరాని ప్రయోజనం

మల్కాజిగిరిలో కొత్త ముఖం.. క్యాడర్‌లో తీవ్ర నైరాశ్యం

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 29 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగర పరిధిలో అసెంబ్లీ ఎన్నికల వేళ తీవ్ర నిరాశకు గురైన అధికార కాంగ్రెస్ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లోనూ అదే వాతావరణం ఎదురవుతున్నది. అభ్యర్థుల ఎంపికలోనే తడబాటుకు గురైన అధిష్ఠానానికి ఆపై క్షేత్రస్థాయిలోనూ ఆశించిన అనుకూలత కనిపించడంలేదు. సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గాల్లో ఆదిలోనే ఎదురీత మొదలైంది. ముఖ్యంగా ఈ మూడు స్థానాల్లోనూ ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొని కండువా కప్పిన వారినే అభ్యర్థులుగా ప్రకటించడంతో హస్తం శ్రేణుల్లో తీవ్ర నైరాశ్యం వ్యక్తమవుతున్నది. కొన్నిచోట్ల నిరసన గళం వ్యక్తమవుతుండటంతో అధిష్ఠానం అంతర్మథనంలో పడిపోయింది. గెలుపు బాట దేవుడెరుగు... ముఖాముఖి పోటీలో ఉంటామా? లేదా? అనే మీమాంస కూడా ఆ పార్టీ నేతల నుంచే వ్యక్తమవుతున్నది.







పద్మారావు అభ్యర్థిత్వంతో ప్రత్యర్థుల్లో గుబులు..

సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నాంపల్లి మినహా మిగిలిన ఆరు స్థానాలు గులాబీ పార్టీనే కైవసం చేసుకోగా, మిగిలిన స్థానం మజ్లిస్ ఖాతాలోకి వెళ్లింది. అంటే ఏడు స్థానాల్లో ఎక్కడా కాంగ్రెస్, బీజేపీల ఊసే లేదు. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఇక్కడ అభ్యర్థి ఎంపికనే ఒక సవాల్‌గా మారింది. ఎవరూ దొరకకపోవడంతో చివరకు బీఆర్ఎస్ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్‌ను పార్టీలోకి తీసుకొని, అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో సొంతగూటిలోనే అసమ్మతి ఒక్కసారిగా భగ్గుమంది. అధికారం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లో ఉండి, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ ఇక్కడ తిష్టవేస్తే తమ పరిస్థితి ఏందంటూ క్యాడర్ అధిష్ఠానంపై కన్నెర్ర జేశారు. పంజాగుట్ట మాజీ కార్పొరేటర్ రాజు యాదవ్ ఒక అడుగు ముందు కేసి.. దానం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, పోటీ చేయాలని డిమాండు చేయడంతో పాటు పార్టీ ఫిరాయింపుపై న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. అసలే పార్టీ పరిస్థితి అంతంత మాత్రం, దానం అభ్యర్థిత్వాన్ని ప్రజలే కాదు చివరకు సొంత పార్టీవారే వ్యతిరేకిస్తుండటంతో అధిష్ఠానం దిక్కుతోచని పరిస్థితిలో పునరాలోచనలో పడినట్లు తెలుస్తున్నది. మరోవైపు బీజేపీ నుంచి పోటీ చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఐదేండ్లు నగరానికి ఏమీ చేయలేదనే అసంతృప్తి తీవ్రస్థాయిలో ఉంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ నుంచి సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన పద్మారావు లోక్‌సభ అభ్యర్థిగా బరిలో దిగడంతో ప్రత్యర్థి పార్టీల్లో గుబులు మొదలైంది. నిత్యం ప్రజల మధ్య నిరాడంబరంగా ఉండే పద్మారావు కొన్ని దశాబ్దాలుగా నగరాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. దీంతో బీఆర్ఎస్ దూకుడుకు ఇక్కడ అడ్డుకట్ట లేకుండా పోయింది.

గులాబీ అడ్డాగా మల్కాజిగిరి..

దేశంలోనే అతి పెద్ద లోక్‌సభ నియోజకవర్గమైన మల్కాజిగిరి స్థానం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఇది కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం కావడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన స్థానం కావడం మరో విశేషం. దీని పరిధిలోకి వచ్చే ఏడు అసెంబ్లీ స్థానాలనూ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ క్లీన్‌స్వీప్ చేసింది. పైగా భారీ మెజార్టీలు కూడా ఇక్కడ వచ్చాయి. మరోవైపు కాంగ్రెస్ పార్టీకి ఇక్కడ అభ్యర్థి కరువ్వడంతో బీఆర్ఎస్ నుంచి వచ్చిన సునీతా మహేందర్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి బరిలో నిలిపారు. కానీ ఆమె ఇక్కడ కొత్త ముఖం కావడంతో పార్టీ క్యాడర్‌లోనే నైరాశ్యం వ్యక్తమవుతున్నది. ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రచారంలోనూ ఆ పరిస్థితులే ప్రతిబింబిస్తున్నాయి. ఇక... బీజేపీ నుంచి బరిలో నిలిచిన ఈటల రాజేందర్‌కు మేడ్చల్ అసెంబ్లీ మినహా మిగిలిన ఆరు శాసనసభ పరిధుల్లో పెద్దగా సంబంధాలు లేవు. అదనంగా బీజేపీకి ఈ లోక్‌సభ పరిధిలో పెద్దగా బలం కూడా లేదనేది గత ఎన్నికల ఫలితాల్లోనే తేలింది. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి ఫలాలు కూడా అందుకుంటున్న ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

ప్రచారంలో బీఆర్ఎస్ దూకుడు

కాసానికి మద్దతుగా సబ్బండవర్గాలు..

చేవెళ్ల లోక్‌సభ స్థానంలోనూ అధికార కాంగ్రెస్ పార్టీ ఆదిలోనే ఎదురీదుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. వాస్తవానికి ఈ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు స్థానాల్లో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం వహిస్తుండగా, మూడు కాంగ్రెస్ గెలుచుకుంది. అయితే కాంగ్రెస్‌లో అసలు అభ్యర్థి దొరక్కపోవడంతో చివరకు బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని తీసుకొని కాంగ్రెస్ కండువా కప్పి అభ్యర్థిగా ప్రకటించారు. వాస్తవానికి బీఆర్ఎస్ బలంతోనే రంజిత్‌రెడ్డి విజయం సాధించారేగానీ అసలు ఆయనకు సొంత బలం ఎక్కడిది? ఎందుకు అభ్యర్థిగా ప్రకటించారు? అని కాంగ్రెస్ వర్గాల నుంచే సూటిపోటి మాటలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయనకు కాంగ్రెస్ పార్టీ నుంచి సహకారమే లభించడం లేదు. పైగా ఇక్కడ అంతో ఇంతో పట్టున్న 'పట్నం' కుటుంబం మల్కాజిగిరిలోనే ఎదురీదుతుండటంతో పరిస్థితి ఇంకా ప్రతికూలంగా మారింది. మరోవైపు బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బరిలో నిలవగా.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు స్థానాల్లో బీజేపీ ఒక్క దానిని సైతం కైవసం చేసుకోలేకపోయింది. ముఖ్యంగా ఈ లోక్‌సభ పరిధిలో గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాలు కూడా ఉండటం కాషాయదళాన్ని ఆందోళనకు గురి చేస్తున్నది. ఇక.. బీఆర్ఎస్ నుంచి పోటీలో ఉన్న కాసారా జ్ఞానేశ్వర్‌కు 96 బీసీ కులాల గొంతుకగా రాష్ట్ర వ్యాప్తంగా మంచి పేరుంది. దీనికి తోడు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రచారం చేస్తున్నారు.